సాక్షి
మంచిర్యాల
శుక్రవారం । 28 । ఏప్రిల్ । 2023



అద్దె భవనాల్లోనే గిడ్డంగులు

సివిల్ సప్లయ్ అధికారులు వ్యవసాయ మార్కెట్ కమిటీ గిడ్డంగులను అద్దెకు తీసుకుని ధాన్యం నిల్వ చేస్తున్నారు. ఇందు కోసం వేలాది రూపాయలు అద్దె చెల్లిస్తున్నారు. 8లో▸

ఓపెన్ పరీక్షలకు 150మంది గైర్హాజర్

మంచిర్యాలఅర్బన్: ఓపెన్ టెన్త్, ఇంటర్మీడియట్ పరీక్షలకు గురువారం 150 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మంచిర్యాల, బెల్లంపల్లిలో పది పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. పదో తరగతిలో మొత్తం 19 మందికి 19 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇంటర్ పరీక్షలకు 1,240 మందికి గాను 1,090 మంది హాజరు కాగా 150 మంది గైర్హాజరయ్యారు. బెల్లంపల్లిలో పరీక్ష కేంద్రాలను రాష్ట్ర పరిశీలకుడు రాజీవ్, జిల్లా కేంద్రంలోని రెండు పరీక్ష కేంద్రాలను డీఈవో వెంకటేశ్వర్లు పరిశీలించారు.

గరిష్ఠం/కనిష్ఠం
35.0 /25.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉటుంది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. ఈదురుగాలులు బలంగా వీస్తాయి.

చౌక మార్కులకే డీలర్ !


- రాత పరీక్షలో మార్కులు తక్కువ, ఇంటర్వ్యూల్లో ఎక్కువ
- రేషన్ డీలర్ల ఎంపికలో లోపించిన 'మౌఖిక' పారదర్శకత
- ప్రతిభ ఉన్నవారిని నిండా ముంచిన అవినీతి పైరవీలు !
- గ్రూప్–1, 2కు లేని ఇంటర్వ్యూలు రేషన్ దుకాణాలకు అమలు


రేషన్ దుకాణం(ఫైల్)

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగాల ఎంపికలో ప్రశ్నపత్రాల లీకేజీ బాగోతం నడుస్తుండగానే జిల్లాలో ఖాళీగా ఉన్న రేషన్‌డీలర్ల నియామకాల్లో అవినీతి చోటు చేసుకుంది. నిరుద్యోగ అభ్యర్థుల ప్రతిభను కొట్టి అధికారులను 'మేనేజ్' చేసి మన అనుకున్న వారికే వచ్చేలా పైరవీలు చేశారు. మంచిర్యాల డివిజన్‌లో కొత్తగా ఎంపికైన రేషన్‌డీలర్ల అభ్యర్థుల నేపథ్యం, ఎంపికైన విధానం పరిశీలిస్తే ఎవరికైనా స్పష్టంగా అర్థమవుతోంది.

ఒక్క డీలర్‌షిప్‌కు ఎంత?

మంచిర్యాల డివిజన్‌లో ఖాళీగా ఉన్న దండేపల్లి, హాజీపూర్, నస్పూర్, భీమారం, మందమర్రి మండలాల్లో 11 రేషన్ దుకాణాలకు డీలర్ల ఎంపిక కోసం పౌరసరఫరాల శాఖ కార్పొరేషన్ నోటిఫికేషన్ జారీ చేసింది. రోస్టర్‌లో రెండు ఎస్సీలకు, మిగతావి జనరల్, జనరల్‌లోనూ రెండు మహిళలకు రిజర్వు చేశారు. కనీస విద్యార్హత పదో తరగతి నిర్ణయించడంతో చాలామంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. గత మార్చి 5న నియామక పరీక్ష నిర్వహించారు. రాత పరీక్షకు 80మార్కులు, మౌఖిక పరీక్ష(ఇంటర్వ్యూ)కు 20 చొప్పున కేటాయించారు. రంగంలోకి దిగిన నాయకులు ఇంటర్వ్యూలో తమ వారే వచ్చేలా చేశారు. పరీక్షలో కొన్ని ప్రశ్నలు ఖాళీలుగా వదిలివేయడం, రాత పరీక్షలో నెగ్గకున్నా, రెవెన్యూ అధికారులు చేపట్టిన ఇంటర్వ్యూలో మాత్రం ఎక్కువగా వచ్చేలా చేశారు. ఒక్కో డీలర్‌కు రూ.రెండు లక్షల నుంచి రూ.మూడు లక్షల వరకు ఖర్చు చేసుకున్నట్లు ప్రచారం సాగుతోంది. ఇందులో ఎవరికి ఎంత ముట్టిందో తెలియదు కానీ ఎంపికైన అభ్యర్థుల నేపథ్యం పరిశీలిస్తే ఎక్కువగా అధికార పార్టీతో సంబంధం ఉన్నవారే కావడం గమనార్హం. ఓ వైపు నిరుద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగాల్లో అవినీతికి ఆస్కారం ఉండొద్దని, గ్రూప్–1, 2, ఎస్సై, తదితర కీలక పోస్టులకు ఇంటర్వ్యూలు రద్దు చేశారు. రాత పరీక్షలో నెగ్గని వారు, ఇంటర్వ్యూలో అడ్డదారిలో ఉద్యోగాల్లో చేరుతున్నారని ఈ నిర్ణయం తీసుకుంది. అయితే జిల్లాలో రేషన్ షాపుల్లో మౌఖిక పరీక్ష పేరుతో పారదర్శకతను పాతరేశారని నష్టపోయిన అభ్యర్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



డీలర్ల నియామక పరీక్ష హాల్‌టికెట్


నస్పూర్‌లో ఓ రేషన్ షాపు రాత పరీక్ష మెరిట్ జాబితా

ఎంపికలో 'మౌఖిక' మాయ

హాజీపూర్ మండలంలో ఓ రేషన్ దుకాణానికి ప్రస్తుత వైస్ ఎంపీపీ తమ్ముడినే డీలర్ షిప్ వరించింది. పరీక్ష రాసిన అభ్యర్థుల్లో ఒకరికి 57మార్కులు రాగా, ఎంపికైన వ్యక్తికి 47మార్కులే వచ్చాయి. అధికారులు చేపట్టిన ఇంటర్వ్యూలో అధికంగా మార్కులు రావడంతో ఎంపిక చేసినట్లు చెబుతున్నారు.

- నస్పూర్ పట్టణంలో ఉన్న ఓ రేషన్ దుకాణానికి ఇక్కడి ఓ వార్డు కౌన్సిలర్ కొడుకే ఎంపికయ్యాడు. ఇక్కడ పోటీ పడిన వారిలో రాత పరీక్షలో మెరిట్ వచ్చిన ఆరుగురిని ఎంపిక చేశారు. 48, 48 ఇద్దరికీ సమ మార్కులు వస్తే, ఐదుగురుకు బదులు ఆరుగురు తీసుకున్నారు. అయితే డీలర్‌గా ఎంపికైన అభ్యర్థి ఐదో స్థానంలో ఉన్నాడు. కానీ ఇంటర్వ్యూలో అధిక మార్కుల రావడంతో ఎంపికయ్యాడు. మరో రేషన్‌షాపు డీలర్‌గా స్థానిక కౌన్సిలర్ భార్యనే ఎంపికైంది. ఆమె మెరిట్ ప్రకారం నాలుగో స్థానంలో ఉంది. ముఖాముఖి పరీక్షలో అధికంగా మార్కులు రావడంతో ఆమెకే పోస్టు దక్కింది. మరోషాపు సైతం ఒకరి సిఫారసుతో ఎంపిక అయ్యారు. ఇక్కడ ఎంపికైన అభ్యర్థి నాలుగో స్థానంలో ఉంది. ఎంపికైన అభ్యర్థి ప్రస్తుత రాష్ట్రపతి ఎవరని అడిగితే కూడా సమాధానం చెప్పలేకపోయినట్లు తెలిసింది. అయితే చిత్రంగా ఆమెనే ఎంపిక జాబితాలో చేరింది.
- దండేపల్లి మండలంలో మూడు చోట్ల ఖాళీల్లో అధికార పార్టీకి చెందిన మాజీ సర్పంచ్ తరపున సిఫారసుతో ఒకరు, ఇంకొకరు ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్, రేషన్ డీలర్ సంఘానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడి పైరవీతో ఓ అభ్యర్థి ఎంపికయ్యారు. వీళ్లు కూడా రాత పరీక్షలో మిగతా అభ్యర్థులతో పోలిస్తే ప్రతిభ చూపనప్పటికీ ఇంటర్వ్యూలోనే అధిక మార్కులు వచ్చి డీలర్లుగా ఎంపిక అయ్యారు. ఓ అభ్యర్థికి 49మార్కులు వచ్చి మొదటి స్థానంలో ఉన్నారు. కానీ ఆ వ్యక్తికి ఇంటర్వ్యూలో తక్కువ మార్కులు వచ్చాయి. 43మార్కులతో ఐదో స్థానంలో ఉన్న వ్యక్తికి ఇంటర్వ్యూలో ఎక్కువ మార్కులు రావడంతో డీలర్ పోస్టు దక్కింది. ఇక భీమారం మండలంలోనూ రాజకీయ పలుకుబడితోనే డీలర్‌గా ఎంపికైనట్లు తెలుస్తోంది.
- మందమర్రి పట్టణంలో ఓ షాపునకు తన సోదరి పేరుతో డీలర్ల సంఘ నాయకుడిగా చలామణిలో ఉన్న ఆయన డీలర్‌గా ఎంపిక అయ్యారు. మరో రెండు రేషన్ షాపుల ఖాళీల్లో ఒకతను బీఆర్ఎస్ పార్టీలో యువజన నాయకుడిగా చెప్పుకునే వ్యక్తి భార్య ఎంపికైంది. మరోచోట కూడా అధికార పార్టీలో పని చేస్తున్న అతని భార్య ఎంపికైంది.

న్యూస్‌రీల్

రైల్వేస్టేషన్‌ను సందర్శించిన డీసీఎం


స్టేషన్‌ను పరిశీలిస్తున్న బృందం సభ్యులు

మంచిర్యాలక్రైం: స్థానిక రైల్వేస్టేషన్‌ను దక్షిణ మధ్య రైల్వే సర్వీస్ ఇంప్రూవ్‌మెంట్ గ్రూప్ గురువారం సందర్శించింది. గ్రూప్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఆర్‌బీబీ రామారావ్, సభ్యులు స్టేషన్ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ప్రయాణికులు, రైల్వే సిబ్బందితో మాట్లాడి స్టేషన్‌లో నెలకొన్న సమస్యలపై తెలుసుకున్నారు. స్టేషన్ అభివృద్ధికి ఎలాంటి పనులు చేపట్టాలనే దానిపై సిబ్బందితో చర్చించారు. అనంతరం స్టేషన్ అభివృద్ధికి కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, స్టేషన్ మేనేజర్ రామారావు, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచే బ్యాడ్మింటన్ ఉచిత శిక్షణ


బ్యాడ్మింటన్ ఆడుతున్న క్రీడాకారులు

మంచిర్యాలటౌన్: వేసవి సెలవుల దృష్ట్యా సాక్షి మీడియా ఆధ్వర్యంలో మంచిర్యాలలోని రంగంపేటలో ఉన్న మాస్టర్ బ్యాడ్మింటన్ అకాడమీ సహకారంతో బ్యాడ్మింటన్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. ఈ నెల 28 నుంచి వచ్చే 4వ తేదీ వరకు ఉదయం ఏడు గంటల నుంచి తొమ్మిది గంటల వరకు శిక్షణ శిబిరం నిర్వహిస్తారు. 6నుంచి 15ఏళ్లలోపు బాలబాలికలు శిక్షణను సద్వినియోగం చేసుకోగలరు. వివరాలకు బ్యాడ్మింటన్ కోచ్ నాగేంద్ర 8978753944, సాక్షి రిపోర్టర్ 9949153168 నంబరులో సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోగలరు.


నీటి పొదుపులో ఎస్టీపీపీకి అవార్డు



ఢిల్లీలో అవార్డు అందుకుంటున్న ప్రసాద్

జైపూర్: మండల కేంద్రంలోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటు(ఎస్టీపీపీ)కు జాతీయ స్థాయిలో దక్షిణాది రాష్ట్రాల కేటగిరీలో మరో ప్రతిష్టాత్మకమైన అవార్డు లభించింది. నీటిని పొదుపుగా వినియోగిస్తున్నందుకు ముంబయికి చెందిన ప్రముఖ మిషన్ ఎనర్జీ ఫౌండేషన్ సంస్థ న్యూఢిల్లీలో నిర్వహించిన జాతీయ స్థాయి సదస్సులో సంస్థ అధ్యక్షుడు ఎస్.డాల్వి థర్మల్ విద్యుత్ కేంద్ర ఏజీఎం కేఎస్ఎస్.ప్రసాద్‌కు అవార్డు అందజేశారు. 500 మెగావాట్లు అంతకు ఎక్కువ స్థాయి గల థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో ఒక మెగావాట్ విద్యుత్ ఉత్పాదనకు 3క్యూబిక్ మీటర్ల వరకు నీటిని వినియోగించవచ్చని సెంట్రల్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ నిబంధనలు ఉన్నాయి. ఎస్టీపీపీలో ప్రత్యేక చర్యల కారణంగా నీటి వినియోగం 2.69క్యూబిక్ మీటర్ల వరకు మాత్రమే ఉంటోంది. ఈ ప్రత్యేకతను గుర్తిస్తూ దక్షిణ భారతదేశంలోని 500మెగావాట్లు అంతకు మించిన థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో అత్యంత పొదుపుగా నీటిని వాడుతున్న సంస్థగా ఎస్టీపీపీకి అవార్డు ప్రకటించారు. ఇదే విభాగంలో రెండేళ్లుగా ఉత్తమ అవార్డులను అందుకోవడం గమనార్హం.

జేపీఎస్, ఓపీఎస్‌ల ఆందోళన


కలెక్టరేట్ ఎదుట నిరసనలో జేపీఎస్‌లు

మంచిర్యాలరూరల్(హాజీపూర్)/మంచిర్యాల అగ్రికల్చర్: తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ జూనియర్ పంచాయతీ కార్యదర్శులు(జేపీఎస్), అవుట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు(ఓపీఎస్) గురువారం ఆందోళన బాట పట్టారు. గురువారం మంచిర్యాల ఐబీ చౌరస్తా నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కలెక్టర్ బాదావత్ సంతోష్‌ను కలిసి తమ డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జేపీఎస్, ఓపీఎస్‌లు మాట్లాడుతూ దశలవారీగా ఆందోళన చేపడుతున్నామని, రెగ్యులర్‌పై ఈ నెల 28లోగా స్పష్టమైన ప్రకటన చేయాలని సమ్మె నోటీసు ఇచ్చినా ఎలాంటి అధికారిక ప్రకటన రాకపోవడంతో పోరుబాట పట్టామని తెలిపారు. 28 నుంచి అన్ని మండల కేంద్రాల్లోని ఎంపీపీ కార్యాలయాల ఎదుట నిరసన చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం నుంచి అధికారిక ప్రకటన వచ్చే వరకు విధులు బహిష్కరిస్తూ నిరవధిక సమ్మెలో పాల్గొంటామని పేర్కొన్నారు.

ప్రయత్నానికి భగీరథుడే ఆదర్శం


నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ సంతోష్, అధికారులు

మంచిర్యాలఅగ్రికల్చర్: ఏదైనా పని తలపెట్టి పూర్తి చేసేవరకు వెనుదిరకుండా చేసే ప్రయత్నానికి భగీరథుడే ఆదర్శమని కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. గురువారం జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో భగీరథ మహర్షి జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి కలెక్టర్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నో అడ్డంకులు ఎదురైనా తలపెట్టిన పనిని పూర్తి చేయడానికి భగీరథుని ఆదర్శంగా చూపుతారని తెలిపారు. భగీరథుడిని స్ఫూర్తిగా తీసుకుని ఎన్ని అడ్డంకులు వచ్చినా పని పూర్తి చేసేలా కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతులు అభివృద్ధి శాఖ అధికారి వినోద్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు చేయాలని రాస్తారోకో


రాస్తారోకో చేస్తున్న రైతులు

లక్సెట్టిపేట: కొనుగోలు కేంద్రాల వద్ద ఉన్న ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని మండలంలోని రైతులు గురువారం స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో జాప్యం చేస్తున్నారని, వర్షాలు, గాలులతో ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. ధాన్యానికి తరుగు వేయవద్దని, ఎటువంటి కోతలు విధించకుండా కొనుగోలు చేసి వెంటనే డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. వర్షాలు కురవడంతో రైతులు ధాన్యం కుప్పల వద్ద కాపలా ఉండాల్సిన పరిస్థితి ఉందని, కవర్లు కొనుగోలు చేయలేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని రైతులను శాంతింపజేశారు. జెడ్పీటీసీ ముత్తె సత్తయ్య, బీజేపీ నాయకులు బొప్పు సతీష్, సీపీఐ నాయకులు దొంద ప్రభాకర్ పాల్గొన్నారు.

ప్రారంభంతోనే సరి..!


దండేపల్లి మండలం లింగపూర్‌లో ధాన్యం కుప్పలు

- కొనుగోలు కేంద్రాల్లో తూకం వేయని ధాన్యం
- మిల్లుల ట్యాగింగ్, తరలింపులో అలసత్వం
- అకాల వర్షాలతో రైతులు ఆగమాగం

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో గత వారం పది రోజులుగా వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు అట్టహాసంగా ప్రారంభిస్తున్నా ధాన్యం సేకరణకు నోచుకోవడం లేదు. కొన్ని చోట్ల ప్రారంభించి.. మరికొన్ని చోట్ల ప్రారంభించకపోవడంతో ఎదురు చూపులు తప్పడం లేదు. మరోవైపు నాలుగు రోజులుగా జిల్లాలో వర్షాలు అన్నదాతలను ఆగమాగం చేస్తున్నాయి. వెంటనే ధాన్యం తూకం వేయాలని ఆందోళనలు, రాస్తారోకోలు చేపడుతున్నారు. రైతుల నుంచి ధాన్యం సేకరించిన కేంద్రాలకు రైస్‌మిల్లుల కేటాయింపు, లారీల తరలింపు ఉంటుంది. కానీ ఇప్పటివరకు కేంద్రాలకు, మిల్లులకు ట్యాగింగ్ చేయలేదు. ఏ కేంద్రం ఎక్కడ ఏర్పాటు చేస్తారో, ఏ మిల్లుకు కేటాయిస్తారో తెలియని గందరగోళం నెలకొంది. పది రోజులుగా కేంద్రాల్లో ధాన్యం పేరుకుపోతోంది. గ్రామాల్లో కేంద్రాల ఏర్పాటులో స్పష్టత లేక, ప్రారంభించిన చోట ధాన్యం తూకం వేయక రైతులు ఆందోళన చెందుతున్నారు.

52 కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

జిల్లాలోని వివిధ ఏజెన్సీల ద్వారా 248 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుకు నిర్ణయించగా.. ఇప్పటివరకు లక్సెట్టిపేట మండలంలో 21, హాజీపూర్‌లో 22, దండేపల్లిలో 9 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. 41 మంది రైతుల నుంచి 393 మెట్రిక్ టన్నుల ధాన్యం తూకం వేయగా 172 మిల్లులకు తరలించినట్లు తెలుస్తోంది. తూకం వేసిన ధాన్యం ట్రాక్ షీట్ ఎంట్రీ, మిల్లులకు తరలించి అన్‌లోడ్ రీసీవింగ్ ఎంట్రీ తదితర వివరాలు ట్యాబ్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. కానీ కొనుగోలు కేంద్రాల కేటాయింపు, మిల్లులకు ట్యాగింగ్‌లో స్పష్టత రాకపోగా ధాన్యం తరలింపు జరగక.. ఏజెన్సీల నిర్వాహకులు రైతుల ధాన్యం తూకానికి వెనుకడుగు వేస్తున్నారు. తూకం వేసి రోజుల తరబడి కేంద్రంలో నిల్వ ఉంచితే మిల్లుకు తరలించిన సమయంలో బరువు తగ్గి, తరుగు పేరుతో మిల్లర్లు కోత విధించే అవకాశం ఉందని నిర్వాహకులు వాపోతున్నారు.

భారీగా లక్ష్యం.. సేకరణ ఆలస్యం

జిల్లాలో 94,200 ఎకరాల్లో వరి సాగు కాగా, 2.28లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ నెల 19నుంచి కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్నారు. కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో జాప్యం, తూకం లేక, ధాన్యం తరలించక ఆలస్యయ్యే కొద్దీ ధాన్యం పోటెత్తుతోంది. మిల్లుల వద్ద అన్‌లోడింగ్‌కు రోజుల తరబడి ఎదురు చూపులు తప్పేలా లేవు.

జిల్లాలో కొనుగోలు కేంద్రాలు, ప్రారంభమైనవి

ఏజెన్సీలు	కేంద్రాలు	ప్రారంభం
పీఏసీఎస్	123	24
డీఆర్‌డీఏ	55	03
డీసీఎమ్మెఎస్	70	25
మొత్తం	248	52

20 రోజులు అవుతుంది..



వరి కోసి 20 రోజులు అవుతుంది. అమ్ముకునేందుకు ఎదురుచూపులు తప్పడం లేదు. కొనుగోలు కేంద్రంలో ఆరబోసి ఎండినై మాయిశ్చర్ కూడా తక్కువగానే వస్తుంది. కొనుగోలు కేంద్రంలో కాంటా పెట్టడం లేదు. నాలుగు రోజులుగా మబ్బులు పడుతూ చిన్నగా వర్షం పడుతుంది. భారీ వర్షం కురిస్తే ధాన్యం తడిసిపోతుందని భయంగా ఉంది.

– అత్తే శంకరయ్య, గ్రామం: బుద్దిపల్లి, మం: హాజీపూర్

కాంటా పెడుతలేరు..



కల్లంలో ధాన్యం ఆరబోసుకొని వారం రోజులు అవుతుంది. గన్నీ సంచులు వచ్చి నాలుగు రోజులు అవుతుంది. ఆరబోసుడు కుప్పజేసి కవర్లు కప్పుడు అవుతుంది. మాపటి పూట మబ్బులు, ఈదురుగాలులు, చినుకులు వస్తున్నాయి. కవర్లు ఇయ్యాలే కొనుక్కొని కప్పుకునుడు అయితంది. వెంటనే కాంటాబెట్టి మిల్లుకు పంపుతే మంచిగుండు.

– బియ్యాల రాజు, గ్రామం: కొత్తపల్లి, మం: లక్సెట్టిపేట


కండక్టర్లకు శిక్షణ ఇస్తున్న అధ్యాపకుడు

ఆర్టీసీ మర్యాద

- బస్సు కండక్టర్లకు పాఠాలు
- ప్రయాణికులకు చేరువయ్యేలా..

మంచిర్యాలఅర్బన్: ప్రయాణికులకు చేరువయ్యేందుకు ఆర్టీసీ ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతోంది. మెరుగైన సేవలందించడం, మర్యాదగా మరింత దగ్గరయ్యేలా ప్రత్యేక కార్యక్రమాల్లో నిర్వహిస్తోంది. మంచిర్యాల డిపోలో 230మంది కండక్టర్లు విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ నెల 21న ప్రారంభమైన టీయాక్ట్ ద్వారా వంతులవారీగా రోజుకు 20మందికి చొప్పున శిక్షణ ఇస్తున్నారు. తర్ఫీదు పొందుతున్న కండక్టర్లకు రోజుకు రూ.200 పారితోషికం చెల్లించడం, మధ్యాహ్న భోజన వసతి ఏర్పాటు చేస్తున్నారు. ప్రయాణికుల పట్ల మర్యాదగా నడుచుకోవడంపై కళాశాల అధ్యాపకులు శిక్షణ ఇస్తున్నారు. బస్సు ఎక్కినప్పటి నుంచి దిగే వరకు ఎలా మసలుకోవాలి అనే అంశాలపై అర్థమయ్యే రీతిలో ప్రొజెక్టర్ ద్వారా శిక్షణ సాగుతోంది. ఆర్టీసీ ఆదాయం పెంపు లక్ష్యంగా ఛాలెంజ్ ఫర్ ట్రైనింగ్(టీ యాక్ట్) అనే వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.

శిక్షణాంశాలు ఇవీ..

ప్రయాణికులు బస్సెక్కిన తర్వాత వారిని సర్, మేడం, మే ఐ హెల్ప్ యూ, థాంక్యూ వంటి చిన్న చిన్న ఆంగ్ల పదాలను వినియోగించి ఆకట్టుకోవాలని సూచిస్తున్నారు. బస్సుల్లో ప్రయాణించే వారిని అతిథులుగా పరిగణించాలని చెబుతున్నారు. మహిళలు, దివ్యాంగులు, వృద్ధులు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు బస్సులో ప్రయాణించేటప్పుడు వారి వద్ద వస్తువులు అధికంగా ఉంటే ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు చేయూతనిస్తే ఆర్టీసీ సిబ్బంది పట్ల గౌరవ భావం ఏర్పడుతుందనే విషయాన్ని గుర్తు చేస్తున్నారు. ప్రత్యేక అవసరాల వారికి కేటాయించిన సీట్లలో వారే కూర్చునేలా చూడాల్సిన బాధ్యతపై కండక్టర్లకు అవగాహన కల్పించారు. ప్రయాణికుల సందేహాలకు ఓపికగా సమాధానాలు చెప్పాల్సిన అంశాలు వివరిస్తున్నారు. ఆర్టీసీ ప్రస్తుత పరిస్థితి, జీతభత్యాల నిర్వహణ, ఆదాయం, ఖర్చులపై అవగాహన, సంస్థల నష్టాల నుంచి ముందడుగు వేసేందుకు ప్రతీ ఉద్యోగి నిర్వర్తించాల్సిన పాత్రపై వివరిస్తున్నారు. పోటీ వాతావరణానికి అనుగుణంగా ఏ సంస్థలోనైనా మార్పు అవసరమని, ప్రయాణికులతో మాట్లాడే విధానం మార్చుకోవడంతోపాటు సమయపాలన అవశ్యకత అంశాలపై నేర్పిస్తున్నారు.

ఆలోచింపజేస్తున్న పాటలు..

టీయాక్ట్ కార్యక్రమంలో శిక్షణ ఇస్తు న్న కండక్టర్లను ఆర్టీసీ సంస్థ ఆధ్వర్యంలో రూపొందించిన వీడియో పాటలు ఆలోచింపజేస్తున్నాయి. ''మనదే.. మనదే మహా సంస్థ మనదే..పల్లె పల్లెలో నుంచి ముల్లేమూటలతో వచ్చే కూలీనాలీని గమ్యానికి చేరవేసే'' అంటూ ఆర్టీసీ బస్సు గొప్పతనం గు ర్తు చేస్తున్నారు. ''అదిగో అదిగో.. కదలుతోంది.. ఆ ర్టీసీ ప్రగతి చక్రం... చెయ్యెత్తితే చాలును ఆగును.. సురక్షిత ప్రయాణానికి ఆర్టీసీ బస్సు'' బస్సుపై చిత్రీకరించిన వీడియో దృశ్యాలు కనువిందు చేస్తున్నాయి.

కండక్టర్లకు వంతులవారీగా శిక్షణ

ఆర్టీసీ యాజమాన్యం ప్రయాణికుల పట్ల మర్యాదగా నడుచుకునేలా వంతులవారీగా శిక్షణ ఇస్తున్నాం. అధ్యాపకులతో తర్ఫీదు ఇప్పిస్తున్నాం. ఉద్యోగుల్లో మార్పుతో పురోగతి సాధ్యమనే ఉద్దేశంతో ఎండీ, చైర్మన్‌లు టీయాక్ట్ కార్యక్రమం చేపట్టారు.

– రవీంద్రనాథ్, ఆర్టీసీ డీఎం

ఇక సర్కారు బడులకు మహర్దశ

- పీఎంశ్రీకి జిల్లాలో 19 పాఠశాలలు ఎంపిక
- కార్పొరేటుకు దీటుగా రూపుదిద్దుకోనున్న బడి
- ఒక్కో స్కూల్‌కు రూ.2కోట్లు నిధులు

మంచిర్యాలఅర్బన్: పీఎంశ్రీ పథకానికి జిల్లాలోని 19 పాఠశాలలు ఎంపికయ్యారు. వీటికి 2023–24 విద్యాసంవత్సరం నుంచి ఏడాదికి రూ.40లక్షలు కేటాయించనున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, బడిని తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం పీఎంశ్రీ(ప్రధానమంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా) పథకం అమలుకు శ్రీకారం చుట్టింది. జిల్లాలో ప్రతీ మండలం నుంచి రెండు పాఠశాలలు ఎంపిక చేసి ఐదేళ్ల వ్యవధిలో రూ.2కోట్ల మేర నిధులు అందించేందుకు ప్రణాళిక రూపొందించింది. మొదటి దఫాలో జిల్లాలో 36 పాఠశాలల్లో 33 ఎంపిక చేసి రాష్ట్రానికి నివేదించారు. రాష్ట్ర అధికారులు కేంద్రానికి నివేదించగా.. కేంద్ర మానవ వనరుల విద్యాశాఖ 19ప్రభుత్వ బడులకు ఆమోదం తెలిపింది. దీంతో కార్పొరేట్‌కు దీటుగా ఆధునీకీకరించనున్నారు.

ఎంపిక ఇలా..

యూడైస్ ప్లస్ 2020–21 ఆధారంగా పది అంశాలను పరిగణనలోకి పాఠశాలలను ఎంపిక చేశారు. మొదట గుర్తించిన 81 పాఠశాలలు ప్రాథమికంగా దరఖాస్తు చేసుకున్నాయి. జిల్లాలో బెంచ్ మార్కు పాఠశాలలను ఎంఈవో, పీజీ హెచ్‌ఎంల నేతృత్వంలో బృందాలు మండల స్థాయి సందర్శించి జిల్లాస్థాయిలో 55 పాఠశాలలను గుర్తించారు. మండలానికి రెండు చొప్పున ఆన్‌లైన్‌లో పొందుపర్చిన అంశాలను బట్టి కేంద్రం నిర్దేశించిన ప్రమాణాలతో అత్యధిక మార్కులు సాధించిన 36 పాఠశాలలను గుర్తించాల్సి ఉంది. ప్రమాణాలకు అనుగుణంగా మూడు పాఠశాలలు లేకపోవడంతో 33 గుర్తించి రాష్ట్ర అధికారులకు పంపించగా అక్కడి నుంచి కేంద్రానికి నివేదించారు. అన్నివిషయాలను పరిశీలించిన కేంద్ర విద్యామంత్రిత్వశాఖ 19 పాఠశాలలను ఎంపిక చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.


ఎంపికైన తీగలపహడ్ జెడ్పీహెచ్చుస్

నిధుల కేటాయింపు..

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతోపాటు ఆధునిక సాంకేతిక వనరుల కల్పనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు కేటాయిస్తాయి. సౌర విద్యుత్, ఎల్ఈడీ విద్యుత్ దీపాల ఏర్పాటు, తోటల పెంపకం, నీటి సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ, స్వచ్ఛత చర్యలు, బొమ్మలతో బోధన, విద్యార్థుల సామర్థ్యాల ముదింపు వంటివన్నీ చేపడతారు. ఉపాధి అవకాశాలపైన అవగాహన కల్పిస్తారు. క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహిస్తారు. విద్యార్థుల్లో భాషా పరమైన అవరోధాలు అధిగమించడానికి అవసరమైన సాంకేతిక సౌకర్యాలను అందుబాటులోకి తెస్తారు.

పాఠశాలలు ఇవే...

టీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్(బాలుర) బెల్లంపల్లి, టీఎస్‌ఆర్‌ఈఐఎస్(బాలుర) తాళ్లగురిజాల), జెడ్పీహెచ్‌ఎస్ భీమారం, ఎంపీపీఎస్ సుద్దాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల చెన్నూర్, ఎంపీయూపీఎస్ టేకుమట్ల(జైపూర్), జెడ్పీహెచ్‌ఎస్ దండేపల్లి, జెడ్పీహెచ్‌ఎస్ దొనబండ, జెడ్పీహెచ్‌ఎస్(బాలికల) జన్నారం, టీఎస్‌ఎంఎస్ కాసిపేట, కోటపల్లి మండలంలో జెడ్పీహెచ్‌ఎస్ దేవులవాడ, ఎంపీపీఎస్ జెండా వెంకటపూర్, లక్సెట్టిపేట టీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్(బాలికల), మంచిర్యాల టీఎస్‌ఎంఎస్, మందమర్రి టీఎస్‌ఎంఎస్, జెడ్పీహెచ్‌ఎస్ తీగలపహడ్(నస్పూర్), జెడ్పీహెచ్‌ఎస్ ఆవడం, జెడ్పీహెచ్‌ఎస్ రేచిని(తాండూర్), జెడ్పీహెచ్‌ఎస్ నీల్వాయి పాఠశాలలు ఎంపికయ్యాయి.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో హోంగార్డుకు గాయాలు



గాయపడిన దుర్గ

కెరమెరి(ఆసిఫాబాద్): రోడ్డు ప్రమాదంలో హోంగార్డు గాయపడిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. జైనూర్ పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వర్తిస్తున్న రాథోడ్ దుర్గ గురువారం ఉదయం విధుల్లో భాగంగా ద్విచక్ర వాహనంపై ఆసిఫాబాద్ వెళ్లాడు. పని ముగించుకుని తిరిగివస్తుండగా కెరమెరిలో బైక్‌కు అడ్డుగా వచ్చిన కుక్కను ఢీకొట్టాడు. దీంతో బైక్ అదుపుతప్పి కిందపడడంతో గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు కెరమెరి ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం ఆసిఫాబాద్ ఆస్పత్రికి తరలించారు.

పురుగుల మందుతాగి మహిళ ఆత్మహత్య

కెరమెరి(ఆసిఫాబాద్): పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై నల్లా వెంకటేశ్ తెలిపిన వివరాల ప్రకారం ఆసిఫాబాద్ మండలంలోని బాబాపూర్‌కు చెందిన మంతిరాం, కల్లుబాయి దంపతుల కుమార్తె సుజాత (30)ను కెరమెరి మండలంలోని జన్కాపూర్ గ్రామానికి చెందిన బానోత్ సుభాష్ ఆరేళ్ల క్రితం రెండో వివాహం చేసుకున్నాడు. ఇటీవల సుభాష్ మద్యానికి బానిసై జులాయిగా తిరుగుతుండేవాడు. ఈక్రమంలోనే దంపతుల మధ్య గొడవలు జరుగుతుండేవి. గురువారం రాత్రి కూడా దంపతుల మధ్య గొడవ జరిగింది. దీంతో మనస్తాపం చెందిన సుజాత పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. మృతురాలి తండ్రి మంతిరాం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మృతురాలికి కుమారుడు, కూతురు ఉన్నారు. సుభాష్ మొదటి భార్య కూడా పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం.

గుడుంబా స్థావరాలపై దాడులు



పట్టుకున్న గుడుంబాతో అధికారులు

నెన్నెల(బెల్లంపల్లి): మండలంలోని నెన్నెల, చిన్న, పెద్దలంబాడితండా గ్రామాల్లోని గుడుంబా స్థావరాలపై గురువారం దాడులు నిర్వహించినట్లు చెన్నూర్ ఎక్సైజ్ సీఐ హరి తెలిపారు. ఈ దాడుల్లో 91 లీటర్ల నాటుసారా, 30 కిలోల బెల్లం, 30 కిలోల పటిక, 20 కిలోల అమోనియా స్వాధీనం చేసుకున్నారు. ఇళ్లు, మామిడితోటల్లో డ్రమ్ములు, బిందెలు, భూమిలో పాతిపెట్టిన 1200 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసి ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ దాడుల్లో మంచిర్యాల, బెల్లంపల్లి, లక్సెట్టిపేట, చెన్నూర్ ఎక్సైజ్ సీఐలు నరేందర్, దీపక్, సాయిబాబా, జిల్లా టాస్క్‌ఫోర్స్ సీఐలు గంగారెడ్డి, మహేందర్‌సింగ్ పాల్గొన్నారు.

అద్దె భవనాల్లోనే గిడ్డంగులు



స్టాకు నిల్వ ఉంచుతున్న గిడ్డంగులు

- నెలకు రూ.2 లక్షల అద్దె చెల్లిస్తున్న సివిల్ సప్లయ్ అధికారులు
- నిరుపయోగంగా పాత గిడ్డంగి
- పట్టించుకోని అధికారులు

లక్సెట్టిపేట(మంచిర్యాల): సివిల్ సప్లయ్ అధికారులు వ్యవసాయ మార్కెట్ కమిటీ గిడ్డంగులను అద్దెకు తీసుకుని అందులో స్టాకు నిలువ ఉంచుతున్నారు. ఇందుకు వేలకు వేలు అద్దె చెల్లిస్తున్నారు. వరి ధాన్యం నిలువ ఉంచేందుకు ఏర్పాటు చేసిన గిడ్డంగులను సివిల్ సప్లయ్ అధికారులు వాడుకోవడంతో రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోలు చేసిన తరువాత నిలువ ఉంచేందుకు అధికారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

రూ.లక్షల్లో అద్దె చెల్లింపు

మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఉన్న నాలుగు గిడ్డంగులను ఎంఎల్‌ఎస్ పాయింట్, సివిల్ సప్లై అధికారులు అద్దెకు తీసుకున్నారు. ఇందులో సరుకులను లోడింగ్ అన్‌లోడింగ్ చేసేందుకు ఉపయోగిస్తున్నారు. వెయ్యి మెట్రిక్ టన్నుల గోదాంకు రూ.41వేలు, ఆరువందల టన్నుల గోదాంకు రూ.21 వేలు, 450 టన్నుల గోదాంలు రెండింటికి కలిపి రూ.12,200 అద్దె చెల్లిస్తున్నారు. దండేపల్లి మండలంలోని లింగాపూర్‌లో ఇటీవల రెండు గిడ్డంగులను నాబార్డు నిధులతో నిర్మించారు. 5వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం ఉన్న గోదాంలో సివిల్ సప్లయ్ గన్నీ బ్యాగులు నిలువ ఉంచి నెలకు రూ.79,952, 2500 మెట్రిక్ టన్నుల గోదాంలో డీసీఎమ్మెస్ ధాన్యం బస్తాలను నిలువ ఉంచడానికి రూ.41,998 అద్దెచెల్లిస్తున్నట్లు మార్కెట్ కమిటీ అధికారులు పేర్కొంటున్నారు. పదిహేనేళ్లుగా నెలకు రూ. 2 లక్షల అద్దె చెల్లిస్తూ డబ్బులు వృథా చేస్తున్నారు.

నిరుపయోగంగా సివిల్ సప్లయ్ గోదాం

సివిల్ సప్లై సరుకులు నిలువ ఉంచేందుకు మండల కేంద్రంలోని సత్యసాయినగర్ కాలనీ వద్ద 1996లో రూ.7 లక్షల నిధులతో గోదాం నిర్మించారు. అప్పటి నుంచి భవనాన్ని వాడుకోకపోవడంతో నిరుపయోగంగా మారి ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంది. సివిల్ సప్లయ్ స్టాకు నిలువ పెరగడంతో భవనాలు సరిపోవడం లేదు. దండేపల్లి, జన్నారం, లక్సెట్టిపేట మండలాలకు సివిల్ సప్లయ్ సరుకులు ఇక్కడి నుంచే సరఫరా అవుతాయి. మూడు మండలాల్లో 81 రేషన్ దుకాణాలు ఉన్నాయి. ప్రతీనెల సుమారు 6వేల టన్నులకు పైగా స్టాకు ఇక్కడ నిలువ ఉంచుతున్నారు. సివిల్ సప్లయ్ అధికారులు సొంత భవనాలపై దృష్టి పెడితే లాభదాయకంగా ఉంటుందని, రైతుల ధాన్యం నిలువ ఉంచేందుకు గిడ్డంగులు ఉపయోగపడుతాయని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు పట్టించుకుని సొంత భవనాల నిర్మాణాలపై దృష్టి పెట్టాలని పలువురు కోరుతున్నారు.

సొంతభవనాలు లేకనే..

వ్యవసాయ మార్కెట్ శాఖ గిడ్డంగులకు ఎంఎల్‌ఎస్ పాయింట్ సివిల్ సప్లై అధికారులు అద్దె చెల్లిస్తున్నారు. రైతులు పండించిన ధాన్యం నిలువ ఉంచేందుకు కొన్ని సందర్భాల్లో భవనాలు ఖాళీగా ఉండడం లేదు. సొంత భవనాలు లేకనే మార్కెట్ గిడ్డంగులను ఉపయోగించుకుంటున్నారు. – శ్రీనివాస్, వ్యవసాయ మార్కెట్ కార్యాలయ కార్యదర్శి, లక్సెట్టిపేట

వేసవిలో తగు జాగ్రత్తలు తీసుకోవాలి



మాట్లాడుతున్న లోక్‌నాథ్‌రెడ్డి

శ్రీరాంపూర్(మంచిర్యాల): వేసవికాలంలో వడదెబ్బ తగలకుండా ప్రతిఒక్కరూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని శ్రీరాంపూర్ ఏరియా హెల్త్ ఆఫీసర్ డాక్టర్ లోక్‌నాథ్‌రెడ్డి సూచించారు. గురువారం ఆరే 6 గనిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో పగటి ఉష్ణోగ్రత అధికంగా నమోదవుతోందని, బయటికి వెళ్లేటప్పుడు తలకు టోపి లేదా రుమాలు, కాటన్ లేత రంగు దుస్తులు ధరించాలన్నారు. తరచూ మంచినీళ్లు, నీరసంగా ఉంటే కొబ్బరి నీళ్లు తాగాలన్నారు. ఎండలో తిరిగి వచ్చిన తరువాత తల తిప్పడం, తలనొప్పి, జ్వరం వంటివి వస్తే వడదెబ్బగా భావించి వైద్యున్ని సంప్రదించాలన్నారు. ఓఆర్‌ఎస్, మజ్జిగ , పండ్ల రసాలు తాగాలన్నారు. మాంసాహారం, మద్యానికి దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో గని మేనేజర్ తిరుపతి, రక్షణాధికారి కాదాసి శ్రీనివాస్, ఇంజినీర్ మహేశ్, డెప్యూటీ మేనేజర్ కొమురయ్య, గుర్తింపు సంఘం నాయకులు ఇప్ప భూమయ్య, అద్దు శ్రీనివాస్, వెంకట్రాజం పాల్గొన్నారు.

పూడ్చివేసిన శవానికి పంచనామా



వివరాలు సేకరిస్తున్న అధికారులు

వాంకిడి(ఆసిఫాబాద్): మండలంలోని సోనాపూర్‌కు చెందిన తొడసం శ్యాంరావు గత నెల 3న తన భార్య సంధ్యను హత్యచేసి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించాడు. అనుమానం వచ్చిన మృతురాలి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విచారణలో హత్యగా నిర్ధారించారు. గురువారం మరిన్ని ఆధారాల సేకరణలో భాగంగా సోనాపూర్ పంచాయతీ పరిధిలోని చిచ్చుపల్లి వద్ద గల ఓ వాగు సమీపంలో పూడ్చిపెట్టిన మృతదేహాన్ని బయటకు తీసారు. తహసీల్దార్ రహీముద్దీన్ సమక్షంలో సీఐ శ్రీనివాస్, ఎస్సై సాగర్, వైద్యుల ఆధ్వర్యంలో పంచనామా నిర్వహించారు.

ఒప్పందాలు అమలు చేయాలి

- సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు టీ.రాజారెడ్డి



మాట్లాడుతున్న రాజారెడ్డి

శ్రీరాంపూర్(మంచిర్యాల): సింగరేణి కార్మికుల డిమాండ్లపై లేబర్ కమిషనర్ ముందు జరిగిన ఒప్పందాలను యాజమాన్యం అమలు చేస్తూ ఉత్తర్వులు ఇవ్వాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు టీ.రాజారెడ్డి డిమాండ్ చేశారు. గురువారం ఆర్కే న్యూటెక్ గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించేంత వరకు సేఫ్టీ కమిటీ సమావేశాలు నిర్వహించాలని, ఎన్నికలు జరిగేంత వరకు కార్మికుల సమస్యలపై చర్చించడానికి అన్ని సంఘాలను పిలవాలని, కార్మికులకు సొంతింటి పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆదాయపు పన్ను రిటర్న్స్ దాఖలుపై కార్మికులు ఆందోళన చెందుతున్నారన్నారు. ఈ సందర్భంగా పలువురు కార్మికులు సీఐటీయూలో చేరారు. ఈ కార్యక్రమంలో ఆయూనియన్ బ్రాంచి అధ్యక్షుడు మిడివెల్లి శంకర్, కార్యదర్శి భాగ్యరాజ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ కస్తూరి చంద్రశేఖర్, నాయకులు బొడకుంట శంకర్, వెంగళ శ్రీనివాస్, అజయ్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

ఏజెంట్ బాధ్యతల స్వీకరణ



పుష్పగుచ్ఛం అందిస్తున్న అధికారులు

శ్రీరాంపూర్(మంచిర్యాల): ఆర్కే గ్రూపు ఏజెంట్‌గా మాలోత్ రాముడు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఏజెంట్‌గా ఉన్న సత్యనారాయణ కైరిగూడ ఓసీపీకి బదిలీ కావడంతో ఆయన స్థానంలో రాముడు ఏజెంట్‌గా వచ్చారు. ఈ సందర్భంగా గని మేనేజర్ రాముడు, ఇంజినీర్ రాజారవిచరణ్, రక్షణాధికారి రవిశంకర్ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ పిట్ సెక్రటరీ మెండె వెంకటి, సంక్షేమాధికారి శాంతన్, సర్వే అధికారి శ్రీనివాస్, టీబీజీకేఎస్ ఏరియా సెక్రటరీ అశోక్ పాల్గొన్నారు.

బీపీఏలో పర్యటించిన డైరెక్టర్



కైరిగూడ ఓసీపీని పరిశీలిస్తున్న డైరెక్టర్

రెబ్బెన(ఆసిఫాబాద్): సింగరేణి డైరెక్టర్ (పీఅండ్‌పీ) జి.వెంకటేశ్వరరెడ్డి గురువారం బెల్లంపల్లి ఏరియాలో పర్యటించారు. ఏరియా జనరల్ మేనేజర్ దేవేందర్‌తో కలిసి ఏరియాలోని కైరిగూడ ఓసీపీని సందర్శించారు. ఉత్పత్తి ఉత్పాదకత, కొనసాగుతున్న సివిల్ పనులపై సమీక్షించారు. గత వర్షాకాలం అధిక వర్షాల కారణంగా కై రిగూడ ఓసీపీకి వెళ్లే మార్గంలో ఉన్న పావురాల గుట్ట వద్ద కొండచరియలు విరిగిపడి దెబ్బతిన్న రోడ్డుకు జరుగుతున్న మరమ్మతు పనులను పరిశీలించారు. అనంతరం గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయంలో అన్ని విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏరియాకు నిర్దేశించిన ఉత్పత్తి సాధించేందుకు సమష్టిగా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటూ జీఎం కేహెచ్‌ఎన్ గుప్తా, ఏజీఎం తిరుమల్‌రావు, పీవో ఉమాకాంత్, డీజీఎం సివిల్ సతీష్‌బాబు, ఏరియా సర్వే అధికారి చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఐటీపై అవగాహన కల్పించాలి

శ్రీరాంపూర్(మంచిర్యాల): ఆదాయపు పన్ను స్లాబుపై ఉద్యోగులకు అవగాహన కల్పించాలని ఏఐటీయూసీ డెప్యూటీ జనరల్ సెక్రటరీ ఎస్కే బాజీసైదా గురువారం ఒక ప్రకటనలో కోరారు. 28 లోగా రిటర్న్స్ దాఖలు చేయాలని ఈ నెల 24న గనులపై నోటీసు వేశారని, రెండు రోజుల్లో పదివేల మంది ఎలా ఐటీ రిటర్న్స్ దాఖలు చేస్తారో చెప్పాలన్నారు. దీనిపై జీఎం స్పందించి అన్ని గనులపై కంపెనీ అధికారులు, సిబ్బందితో కార్మికులకు అవగాహన కల్పించాలని కోరారు.

ధాన్యం తనిఖీ కేంద్రం ఏర్పాటు



అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద సిబ్బంది

కోటపల్లి: తెలంగాణ సరిహద్దు రాష్ట్రాలైన మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ నుంచి ధాన్యం ఇక్కడికి రాకుండా జిల్లా యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా కోటపల్లి మండలం రాపన్‌పల్లి ప్రాణహిత నది వంతెనపై ధాన్యం తనిఖీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఆయా రాష్ట్రాల్లోని దళారులు తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేసి తెలంగాణలో ఇక్కడి రైతుల ముసుగులో ఎక్కువ ధరకు విక్రయించేందుకు వస్తుండటంతో వారికి చెక్ పెట్టడానికి ఈ చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు

జన్నారం: ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు గడించవచ్చని రాష్ట్ర ఆయిల్ పామ్ కన్సల్టెంట్ అధికారి ఎం.నర్సింహారావు అన్నారు. గురువారం జన్నారం మండలం దేవునిగూడలో రైతులు ఆయిల్‌పామ్ తోటలను పరిశీలించారు. ఆయన వెంట జిల్లా ఉద్యానవన అధికారి ఉదయ్‌కుమార్, సీఈవో ఉదయ్‌కుమార్, ఏడీ అనిత, తదితరులు ఉన్నారు.



రైతులకు సూచనలు ఇస్తున్న నర్సింహారావు

మిర్చి @ రూ.250



కోటపల్లి(చెన్నూర్): ఈ ఏడాది మిర్చి ధర ఘాటెక్కుతోంది. గతేడాది కిలోకు రూ.120 నుంచి రూ.130 ధర పలికిన ఎండుమిర్చి నేడు రూ.250 నుంచి రూ.280 వరకు పలుకుతోంది. మార్కెట్లో ధరలు హెచ్చు తగ్గులు అవుతున్నా వ్యాపారులు మాత్రం తగ్గించడంలేదు.

నాలుగు క్వింటాళ్ల నల్లబెల్లం పట్టివేత



గోదాంలో తనిఖీ చేస్తున్న పోలీసులు

బెల్లంపల్లి: పట్టణంలోని కిరాణా దుకాణాలు, గోదాముల్లో గురువారం ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. అంతకుముందు హైదరాబాద్ నుంచి వచ్చిన ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు నెన్నెల మండలంలోని పలుగ్రామాల్లో గుడుంబా తయారీదారుల ఇళ్లలో తనిఖీ చేయగా కొందరి వద్ద బెల్లం పట్టుబడింది. ఎక్కడినుంచి తెచ్చారని ప్రశ్నించగా బెల్లంపల్లిలోని ఓ కిరాణా దుకాణం నుంచి తెచ్చినట్లు చెప్పారు. దీంతో బెల్లంపల్లిలో తనిఖీలు నిర్వహించారు. కాంట్రాక్టర్ బస్తీలోని ఇళ్ల మధ్య ఉన్న గోదాం తాళం తీసి సోదా చేయగా కాటన్‌లలో ఉంచిన నాలుగు క్వింటాళ్ల నల్లబెల్లం స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ దీపక్ తెలిపారు. షాపు యాజమానిపై కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

ఎమ్మెల్యే చిన్నయ్యను బెదిరించిన యువకుడి అరెస్టు

బెల్లంపల్లి: సునాయాసంగా డబ్బు సంపాదించాలనే దురుద్దేశంతో మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యను ఫోన్‌లో బెదిరించిన యువకుడిని పోలీసులు గురువారం అరెస్టు చేశారు. బెల్లంపల్లి వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో టి.శంకరయ్య కథనం ప్రకారం... కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం ఆజామాబాద్‌కు చెందిన ఇషాక్ ప్రైవేట్ కళాశాలల్లో ఫ్యాకల్టీగా పనిచేస్తున్నాడు. క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడి నష్టపోయాడు. ఫ్యాకల్టీగా చాలీచాలని వేతనం వస్తుండడంతో తక్కువ సమయంలో డబ్బులు సంపాదించాలని నిర్ణయించుకున్నాడు. యూట్యూబ్ చూసి ఇటీవల వార్తల్లోకెక్కిన ఎమ్మెల్యేలను లక్ష్యంగా చేసుకున్నాడు. బెల్లంపల్లి ఎమ్మెల్యే చిన్నయ్య ఇటీవల ఓ వివాదంలో చిక్కుకున్నట్లు తెలుసుకున్నాడు. ఈ నెల 23, 24వ తేదీల్లో వరుసగా పలుమార్లు ఎమ్మెల్యేకు ఫోన్ చేసి డబ్బులు కావాలని డిమాండ్ చేశాడు. రూ.90 వేలు ఇవ్వాలని లేనిపక్షంలో సోషల్ మీడియాలో మరింత దుష్ప్రచారం చేస్తానని బెదిరించాడు. 24న ఎమ్మెల్యే వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేశారు. అదే తీరుగా స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య, ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డిలకు సైతం ఫోన్ కాల్ చేసి డబ్బులు ఇవ్వాలని ఇషాక్ బెదిరించాడు. బెదిరిస్తే సునాయసంగా డబ్బులు వస్తాయనే ఆశతో ఇషాక్ బ్లాక్ మెయిలింగ్ చేశాడని పేర్కొన్నారు. నిందితుడిని పట్టుకుని కోర్టులో హాజరుపర్చామని ఎస్‌హెచ్‌ఓ శంకరయ్య తెలిపారు.

గొర్రెల లబ్ధిదారులు వాటా చెల్లించాలి



మాట్లాడుతున్న అధికారి రమేశ్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): రెండో విడత గొర్రెల పంపిణీకి ఎంపికైన లబ్ధిదారులు తమ వాటా చెల్లించాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ వై.రమేశ్ సూచించారు. గురువారం ముల్కల్ల గ్రామ పంచాయతీలో గొర్రెలు, మేకల పెంపకందారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులు తమ వాటా రూ.43,750 కలెక్టర్, మంచిర్యాల బ్యాంకు ఖాతాకు ఆర్‌టీజీఎస్ ద్వారా జమ చేసి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వేసవిలో జీవాల సంరక్షణ, పశుగ్రాసం పెంపుపై రైతులకు అవగాహన కల్పించారు. సమావేశంలో సర్పంచ్ మంచాల శ్రీనివాస్, పశుసంవర్ధక శాఖ ఏడీ శంకర్, మండల పశువైద్యాధికారి శాంతిరేఖ, ముల్కల్ల, నంనూర్ గ్రామాల ప్రాథమిక గొర్రెల సహకార సంఘ సభ్యులు పాల్గొన్నారు.

సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో సుబ్బరాయుడు

మంచిర్యాలటౌన్: సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలని డీఎంహెచ్‌వో సుబ్బరాయుడు అన్నారు. గురువారం జిల్లాలోని ప్రైవేటు గైనకాలజిస్టులతో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు ఆస్పత్రుల్లో నెలలు నిండకుండా ప్రసవాలు చేయవద్దని, మొదటి కాన్పు తప్పనిసరిగా నార్మల్ డెలివరీ చేయాలన్నారు. ముహూర్తపు ప్రసవాలు చేయవద్దని, సిజేరియన్ డెలివరీలు తగ్గించాలని అన్నారు.

రైతులు నష్టపోకుండా చర్యలు



పంటలు పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి కల్పన

బెల్లంపల్లిరూరల్: అకాల వర్షాలతో వరి సాగుచేస్తున్న రైతులు నష్టపోకుండా చర్యలు చేపడుతామని జిల్లా వ్యవసాయాధికారి జి.కల్పన అన్నారు. గురువారం బెల్లంపల్లి మండలం బట్వాన్‌పల్లి శివారులో వరి పంట క్షేత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాతావరణంలో మార్పుల వలన ఏ సమయంలోనైనా వర్షాలు పడే అవకాశం ఉందని, రైతులు కాలానికి అనుగుణంగా వరి కోతలు చేపట్టాలని సూచించారు. కోతలు చేపట్టిన రైతులు ధాన్యాన్ని జాగ్రత్తగా సంరక్షించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి ఏడీఏ ఇ.సురేఖ, ఇన్‌చార్జి మండల వ్యవసాయాధికారి వందన, ఏఈవో సంధ్య, రైతులు పాల్గొన్నారు.

‘గల్ఫ్ కార్మికులు ఏకమై పోరాడుదాం’



సమావేశంలో మాట్లాడుతున్న భూమయ్య

జన్నారం: గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం గల్ఫ్ కార్మికులందరం ఏకమై పోరాడుదామని తెలంగాణ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కల్లెడ భూమయ్య అన్నారు. ఈ నెల 28న అంతర్జాతీయ కార్మికుల దినోత్సవం పురస్కరించుకుని జన్నారం మండల కేంద్రంలో సమావేశం నిర్వహించారు. ‘మృతిచెందిన వారిని స్మరించుకుని, బతికున్న వారి కోసం పోరాడుదాం’ అనే నినాదంతో పోరాటాలు చేయాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా భూమయ్య మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఏర్పడి ఎనిమిదేళ్లు గడుస్తున్నా గల్ఫ్ కార్మికుల హామీలు నెరవేర్చలేదని ఆరోపించారు. ప్రభుత్వం గల్ఫ్ కార్మికుల సంక్షేమంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం నేర్పిస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అమరగొండ తిరుపతిగౌడ్, ప్రధాన కార్యదర్శి పెరుగు మల్లిఖార్జున్, ప్రచార కార్యదర్శి హసెన్, మండల అధ్యక్షుడు పాలాజీ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి దుమల్ల ఎల్లయ్య, నాయకులు రవి, శ్రీనివాస్, శేఖర్, అంజయ్య పాల్గొన్నారు.

1న చెస్ టోర్నమెంట్

రెబ్బెన(ఆసిఫాబాద్): గోలేటిలోని సింగరేణి ఉన్నత పాఠశాలలో మే 1న నిర్వహించే చెస్ టోర్నమెంట్‌ను క్రీడాకారులు విజయవంతం చేయాలని బెల్లంపల్లి ఏరియా జీఎం దేవేందర్ కోరారు. గురువారం జిల్లా చెస్ అసోసియేషన్ సభ్యులు ఏరియా జనరల్ మేనేజర్‌ను కలిసి టోర్నమెంట్‌కు ఆహ్వానించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కోట సుధాకర్ మాట్లాడుతూ టోర్నమెంట్‌కు ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్ జిల్లాలకు చెందిన క్రీడాకారులు హాజరవుతారని తెలిపారు. అండర్ 9, 11, 13, 15 విభాగాల్లో పోటీలు నిర్వహిస్తామన్నారు. మూడు ఉమ్మడి జిల్లాలకు చెందిన క్రీడాకారులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు బోగే ఉపేందర్, కోశాధికారి మల్లేశ్, ఈసీ సభ్యులు ఎం.తిరుపతి పాల్గొన్నారు.



జీఎంకు ఆహ్వానపత్రిక అందిస్తున్న సభ్యులు

రైతులకు పరిహారం అందించాలి



మాట్లాడుతున్న వెరబెల్లి రఘునాథరావు

లక్సెట్టిపేట: పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం అందించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథరావు అన్నారు. గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గూడెం లిఫ్ట్ ఇరిగేషన్ పైపుల లీకేజీతో నష్టపోయిన రైతులకు పరిహారం అందించకుండా మోసం చేసారన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద ఎలాంటి సౌకర్యాలు లేవన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద రశీదులు ఎందుకు ఇవ్వడం లేదని, దీనిపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు బొప్పు కిషన్, హరిగోపాల్, వేముల మధు, శివశంకర్, ప్రభాకర్, రమేశ్ పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మండలంలోని కర్ణమామిడికి చెందిన బొడ్డు సురేశ్ నెలరోజుల క్రితం ఫోన్ పోగొట్టుకున్నాడు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఈఐఆర్ పోర్టల్ ద్వారా వ్యక్తిని అదుపులోకి తీసుకుని ఫోన్ రీకవరీ చేశారు. గురువారం మంచిర్యాల రూరల్ సీఐ తోట సంజీవ్, హాజీపూర్ ఎస్సై నరేష్ చేతుల మీదుగా బాధితుడికి ఫోన్ అప్పగించారు.